మహిళలను గౌరవించాలి

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న సిరి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, మార్చి 5: సమాజంలో మహిళలను పురుషులతో సమానంగా గౌరవించాలని అప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని వైఎన్ఆర్ గార్డెన్‌లో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ జ్యోతి ప్రజ్వల చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషించడంతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగాలు, రాజకీయాలు, వ్యాపారాలు చేస్తూ పురుషులతో సమానంగా రాణించి ధైర్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ సుష్మామహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, జడ్పీటీసీ నీరటి తన్విరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, వైస్ ఎంపీపీ నీలంనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కే.చంద్రారెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు, సిరి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మహిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాధవితో పాటు మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

– బంజారాహిల్స్, మార్చి 5

ప్రజావాణిలో ఫిర్యాదు ఆక్రమణల తొలగింపు

బండ్లగూడ, మార్చి 5: తమ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలను కుల్చివేశారు. డీసీ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్‌కు చెందిన ఓ మహిళ తమకు సంబంధించిన స్థలంలో కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాయలంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌కు అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం గగన్‌పహాడ్‌లోని అక్రమ నిర్మాణాలను తొలగించారు. దీంతో సదరు మహిళ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ఆక్రమణల కూల్చివేత

జూబ్లీహిల్స్, మార్చి 5: అక్రమ నిర్మాణాలపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మంగళవారం బోరబండ వీకర్ సెక్షన్‌లో రోడ్లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, హోటళ్లను జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. యూసుఫ్‌గూడ సర్కిల్ ఏసీపీ రాణి ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

మతతత్వ భావజాలం దేశానికి ప్రమాదకరం

హిమాయత్‌నగర్, మార్చి 5: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం, మతతత్వ భావజాలంను ప్రోత్సహించడం వల్ల దేశానికి ప్రమాదకరమని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు డాక్టర్ బీవీ విజయలక్ష్మి ఆరోపించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా ధ్వేషపూరిత రాజకీయాలను తిరస్కరిద్దాం–లౌకిక ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని కూల్చివేసి దాని స్థానంలో హిందుత్వాన్ని తీసుకురావాలని కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలకు హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కల్పిస్తున్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం లౌకికవాద పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు సదాలక్ష్మి, నాయకురాలు పద్మ, పి.ప్రేంపావని, ఎన్.జ్యోతి, ఎస్.ఛాయదేవి, జంగమ్మ, ఫమిదా, కమలారెడ్డి, పడాల నళిని, గిరిజ, నీలమ్మ, మంజుల, హైమావతి, మాధవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న వాసు కె.యాదవ్

ప్రజాపాలనలో ధర్నాకు అనుమతి లేదా?

- ప్రభుత్వ పెద్దల 'హస్తం' వల్లే కేసు నీరుగార్చే ప్రయత్నం
- ఆడబిడ్డల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఖైరతాబాద్, మార్చి 5 : ప్రజా పాలనంటూ చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధర్నా చౌక్ వద్ద శాంతియుత నిరసన తెలిపేందుకు అనుమతి దొరకడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భవ్య, వైష్ణవి న్యాయపోరాట సమితి, మహిళా, ప్రజా, విద్యార్థి, కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భవ్య తండ్రి నరేశ్, బహుజన సేన అధ్యక్షుడు వాసు కె.యాదవ్, కుల నిర్మూలన పోరాట సమితి ప్రధానకార్యదర్శి బి.అభినవ్, ఆడబిడ్డలసంఘం అధ్యక్షురాలు ధన లక్ష్మి, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి హాస్టల్‌లో గత నెల 3న అనుమానాస్పదంగా మృతిచెందిన భవ్య, వైష్ణవి కుటుంబ సభ్యులకు నేటికీ ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. ఆటోడ్రైవర్, వార్డెన్లు వారి మరణాలకు కారకులని, ఇద్దరు ఆడబిడ్డలు చనిపోయి నెల రోజులు గడిచినా నేటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. కనీసం పోస్టుమార్టం రిపోర్టు సైతం ఇవ్వడం లేదని, నెల రోజులు పడుతుందని పోలీసులు దాటవేస్తున్నారన్నారు. చివరకు ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపేందుకు వెళితే మొదట అనుమతిస్తామని చెప్పిన పోలీసులు అనుమతి లేదంటూ బాధిత కుటుంబ సభ్యులను అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. అంతేకాకుండా ధర్నా చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని దోమలగూడ సీఐ దుర్భాషలాడుతూ బెదిరించారని వాపోయారు. కొందరు ప్రభుత్వ పెద్దల 'హస్తం' ఉండటం వల్లే పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భవ్య, వైష్ణవీ మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఆందోళన ఉధృతంగా కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు కోడి సుధీర్, కృష్ణ, శ్రీనివాస సోమయ్య, వివిధ సంఘాల నాయకులు లలిత, రోజా, కేవీ గౌడ్, జాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి

ఖైరతాబాద్, మార్చి 5 : మాదిగలకు కాంగ్రెస్ కేబినెట్‌లో సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపక అధ్యక్షులుడు మరమ్మల మల్లేశ్ మాదిగ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికత్తి లింగన్న మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మొట్టుపల్లి కొమురయ్య మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కూశనపల్లి రవి, సంకటి శ్యామేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎర్రా ఆంజనేయులు, కొండూరి రాజు, బొట్ల రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయహస్తం పథకంలో భాగంగా ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షలు కేటాయించాలన్నారు. మాల, మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన నిధులు విడుదల చేయాలన్నారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు..

శంషాబాద్ రూరల్, మార్చి 5: వ్యవసాయ పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటలను పరిశీలించి వాటి వివరాలు అక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగుచేస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు వ్యవసాయ అధికారుల రికార్డుల్లో ఉంటాయన్నారు. ఇందులో భాగంగా సీబీక్యూ యాప్ ద్వారా వచ్చిన సర్వే నంబర్‌ల ఆధారంగా రైతుల వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని వివరించారు. వరి, మక్కజొన్న, కూరగాయాల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కవిత, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

శంషాబాద్ రూరల్, మార్చి 5: రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు మల్కారం సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ తెలిపారు. మంగళవారం కార్యాయలంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం సాగు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా వారికి రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నట్లు తెలిపారు. మల్కారం సహకార సంఘం పరిధిలోని 8 మంది రైతులకు రూ.35 లక్షల దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేశామని వివరించారు. వారికి త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో సహకార సంఘం డైరక్టర్లు బాల్‌రాజ్‌గౌడ్, రవికాంత్‌రెడ్డి, దర్గా సత్తయ్య, ఎండీ వజీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలి

ఖైరతాబాద్, మార్చి 5: ప్రభుత్వ జీవో ప్రకారం సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని తెలంగాణ జీవిత ఖైదీల కుటంబ సభ్యులు వేడుకుంటున్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుటుంబ సభ్యులు, రమణ, రాజేశ్, నాగమణి మాట్లాడుతూ.. తమ కుటుంబ పెద్దలు తెలిసి, తెలియక చేసిన తప్పుల వల్ల చట్టం పరిధిలో శిక్షిపడి జీవిత ఖైదీలుగా కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే 231 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల కోసం కేబినెట్‌లో సైతం ఆమోదించారని, సంబంధిత ఫైల్‌ను గత నెల 10న గవర్నర్‌కు పంపించారని, సుమారు 20 రోజులు దాటినా స్పందించలేదని.. ఇప్పటికైనా గవర్నర్ స్పందించి ఆమోదించాలని కోరారు. ఈ సమావేశంలో రాధ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నీటి వ్యాపారాలు చేస్తే చర్యలు

మణికొండ, మార్చి 5: అక్రమ నీటి వ్యాపారాలు చేసే వారిపై వాల్టాచట్టం ద్వారా కేసులు నమోదు చేస్తామని గండిపేట తాశీల్దార్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో అక్రమంగా నీటి వ్యాపారాలు చేస్తున్న కేంద్రాలను రెండురోజులుగా ప్రత్యేక బృందాలతో కలిసి కూల్చివేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తాశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ భూములను అక్రమదారిలో లీజులు తీసుకుని అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే బోర్లువేసి ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం చేస్తున్నట్లు స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేశారని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో తరలివెళ్లి జేసీబీల సహాయంతో నీటి వ్యాపార కేంద్రాలను కూల్చివేశామని, అదేవిధంగా విద్యుత్‌శాఖ అధికారులను సమాచారం అందించి వ్యవసాయం చేసుకునే భూమిలో వ్యాపారాలు చేసుకునేందుకు విద్యుత్ మీటర్లను ఏవిధంగా ఇస్తున్నారనే అంశాలపై వివరణ కోరుతున్నామన్నారు. భూగర్భ జలాలను అక్రమదారిలో వ్యాపారాలు చేస్తున్న వారిపై త్వరలోనే వాల్టా చట్టం ద్వారా కేసులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని తెలిపారు. రెండు రోజుల్లో సుమారు 60 చోట్ల అక్రమ నీటి వ్యాపారాలు జరుగుతున్నట్లు గుర్తించామని వెల్లడించారు. త్వరలోనే స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేసి నీటి వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ట్రాఫిక్ బూత్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బంజారాహిల్స్, మార్చి 5: నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్డు మధ్యలోని ట్రాఫిక్ బూత్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ చౌరస్తాలోని ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌లో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి తీవ్రమైన గాయాలతో పడి ఉన్న విషయాన్ని గుర్తించిన స్థానికులు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. తలతో పాటు ముఖం మీద తీవ్ర గాయాలు ఉండటంతో ఎవరైనా కొట్టి ట్రాఫిక్ బూత్‌లో పడేశారా, లేకుంటే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా గాయాలపాలైన తర్వాత ఆ వ్యక్తి అక్కడకు వచ్చి చనిపోయాడా అనే విషయంపై పోలీసలు దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన వ్యక్తికి సంబందించిన ఆధారాలు లభ్యం కాలేదు. అతడు యాచకుడు కావచ్చని, లేదా మద్యం మత్తులో రోడ్డుపై ప్రమాదానికి గురి కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు 174 కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

బల్దియా కార్యాలయంలో ఓటింగ్‌పై అవగాహన

జూబ్లీహిల్స్, మార్చి 5: ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు భద్రత మధ్య స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు భరోసా కల్పిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు పోలింగ్ ప్రక్రియపై పరిజ్ఞానం కల్పించేందుకు ప్రయోగాత్మకంగా ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో పారదర్శక ఓటింగ్ విధానంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఈవీఎం మెషీన్ ఏర్పాటు చేశారు. కొత్త ఓటర్లు ఎన్నికల సమయంలో అపోహలకు పోకుండా.. ఆందోళన పడకుండా ఓటింగ్‌లో పాల్గొనేందుకు మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సేవా ఇస్లావత్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు ఓటింగ్‌లో పాల్గొనే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

కాంగ్రెస్ టికెట్ లక్ష్మీనారాయణకే కేటాయించాలి

ఖైరతాబాద్, మార్చి 5: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ టికెట్‌ను టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు కేటాయించాలని లంబాడ హక్కుల పోరాట సమితి ఏక్ మాత్రో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వాంకుడోతు మంగిలాల్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 70 శాతానికి పైగా గిరిజన జనాభా కలిగిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గిరిజనులకే ఆ టికెట్‌ను కేటాయించాలన్నారు. 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నారని, ఆయన సతీమణి లకావత్ ధన్వంతి వరంగల్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారని గుర్తు చేశారు. ఈసారి టికెట్ కేటాయిస్తే 5లక్షల మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తేజావత్ రవీందర్ నాయక్, బానోతు లక్ష్మణ్ నాయక్, మోతిలాల్, నాగేందర్ నాయక్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్.. నిందితుల అరెస్టు

మణికొండ, మార్చి 5: నార్సింగి ఔటర్ రింగ్‌రోడ్డుపై సోమవారం జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. కాగా జవాన్ కునాల్(34) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయేందుకు అతివేగంగా వాహనం నడిపిన ఇద్దరు నిందితులను మంగళవారం నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగరానికి చెందిన రుక్షద్(25), అలాం అలియాస్ మహమ్మద్ అలాం అన్సారీ(30)గా సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించి అరెస్టుచేశారు. ఔటర్‌పై పరిమితికి మించి రెడీమిక్స్ వాహనాన్ని నడిపి రోడ్డు దాటుతున్న జవాన్‌ను ఢీ కొట్టి పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని.. రూ.55 వేలు మోసం

వెంగళరావునగర్, మార్చి 5: ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని బోల్తా కొట్టించి రూ.55వేలకు మోసగించిన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లో నివాసం ఉండే ఏ.కిశోర్‌కు ఫెడ్ ఎక్స్ కొరియర్ ఆఫీస్ పేరుతో కాల్ వచ్చింది. మీ ఆధార్ కార్డ్ నంబర్‌తో ముంబై నుంచి తైవాన్‌కు పార్సిల్ బుక్ చేశారని. అందులో డ్రగ్స్, నాలుగు పాసు పోర్టులు, సిమ్ కార్డులు ఉండటంతో వాటిని కస్టమ్స్ అధికారులు బ్లాక్ చేశారని మీ కాల్‌ను స్కైప్ ద్వారా ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. ముంబై క్రైమ్ బ్రాంచ్ అని మాట్లాడిని నకిలీ పోలీసులు.. కిశోర్‌కు చెందిన బ్యాంక్ వివరాలు, ఆధార్ కార్డు వివరాలను తీసుకున్నారు. అనంతరం ఓ బ్యాంకు అకౌంట్ నంబర్‌కు రూ.55,000 పంపాలని సూచించారు. ఆ తర్వాత బాధితుడు ఆరాతీయగా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గ్రహించి మధురానగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఇంటికి స్వచ్ఛ ఆటో వస్తుందా..

- ఆటో వచ్చినా రోడ్లపై చెత్త వేస్తే చర్యలు
- అధికారులతో కలిసి ఇంటింటి ప్రచారంలో డీసీ సేవా ఇస్లావత్

డీసీ, ఏఎంఓహెచ్‌లతో కలిసి మీ ఇంటికి స్వచ్ఛ ఆటో వస్తుందా అని తెలుసుకుంటున్న యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్ రావు

జూబ్లీహిల్స్, మార్చి 5: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్ రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మీ ఇంటికి స్వచ్ఛ ఆటో వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటో వెళితే రోడ్డుపైకి చెత్త వచ్చే ప్రసక్తే లేదన్నారు. స్వచ్ఛ ఆటో ఇంటికి వచ్చినా ఆటో సిబ్బందికి చెత్త ఇవ్వకుండా రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు.. శానిటేషన్ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ సంతోష్, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సూత్ర డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్, మార్చి 5: దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో సూత్ర డిజైనర్ ఎగ్జిబిషన్ మంగళవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రారంభమైంది. జబర్దస్ట్ ఫేమ్ వర్షతో పాటు మోడల్స్ విభిన్నమైన వస్త్రాలతో సందడి చేశారు.

బీసీలకు న్యాయం జరిగేవరకు పోరాటం

శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ఇంటి నుంచి పాద యాత్రగా ఢిల్లీకి బయలుదేరిన బీసీ నాయకులు

బండ్లగూడ, మార్చి 5: చట్ట సభల్లో బీసీలకు సముచిత న్యాయం దక్కేవరకు పోరటం చేయాల్సిన అవసరం ప్రతి బీసీ బిడ్డా మీద ఉందని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. ఇందులో భాగంగా బీసీ నాయకులు మహబుబ్ నగర్ నుంచి ర్యాలీగా బయలు దేరి స్వామిగౌడ్ నివాసానికి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాల గురించి చర్చించారు. బీసీలకు అన్ని రంగాల్లో దామాషా ప్రకారం సముచిత న్యాయం కల్పించే వరకు పోరాటం చేయలని స్వామిగౌడ్ సూచించారు. అనంతరం స్వామిగౌడ్ సమక్షంలో బీసీ నాయకులు ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి..

- మాజీ సర్పంచ్‌ల ఆత్మహత్యలను ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్యగౌడ్

హిమాయత్‌నగర్, మార్చి 5: గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్‌లకు బకాయి ఉన్న బిల్లులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయాలను అప్పులకు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ప్రభుత్వం విడుదల చేయాల్సిన బిల్లును మంజూరు చేయకపోవడం వల్ల మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.1200 కోట్లకు పైగా మాజీ సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి బకాయి ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాజారాం, చంద్రమౌళి, మధుసూదన్‌రెడ్డి, లాలయ్య, సుభాష్, రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంకీ క్యాప్ ధరించి చోరీ..

వెంగళరావునగర్, మార్చి 5: మఖానికి మంకీ క్యాప్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి టీవీతో పాటు రిమోట్‌ను వసతి గృహం నుంచి అపహరించుకెళ్